# 29. బ్రహ్మ వాక్కు

ఇవాళ వైకుంఠంలో చాలా హడావిడిగా ఉన్నది. మధ్యాహ్నం పన్నెండింటికి త్రిలోకాధిపతుల ప్రత్యేక రహస్య సమావేశం జరుగబోతున్నదనే వదంతి బయలుదేరింది. ఐతే వారు చర్చించబొయ్యే విషయా లేమిటో, ఛేదించబొయ్యే సమస్య లేమిటో ఎవ్వరూ ఊహించలేకపోతున్నారు. కనీసం యీ సమావేశం ఎంతకాలం సాగుతుందో కూడా ఎవరికీ తెలియదు. విష్ణుమూర్తి మాత్రం చాలా హడావిడిగా, ఆందోళనతో ఉన్నాడు. మళ్ళీ ఏదో కొత్త ముప్పు ముంచుకొచ్చిందని అందరూ తలపోశారు. రాజకీయాలే అలాంటివి కనుక, రాజకీయ నాయకులకు మనశ్శాంతి ఉండకుండటం సహజమే కదా నని మరికొందరు భావించారు.

పదకొండింటికే ఈశ్వరుని వృషభం వైకుంఠం జేరింది. బొత్తిగా తీరికే లేని యీ నాయకులు అనుకున్నదానికన్న ఆలస్యంగా రావటం పరిపాటి. కాని ఈశ్వరుడు గంట ముందుగా ఎందుకొచ్చాడో ఎవరికీ అర్థం కాలేదు; బహుశా తాము ఊహించినదానికన్న విషమపరిస్థితి ఏదో వెన్నాడుతూండి ఉండవచ్చని చిన్నచిన్న నాయకులూ, కార్యదర్శులూ అనుకున్నారు. అందుకు తగినట్లుగానే భూతనాధుని ముఖంలో తీవ్రమైన ఆందోళన గోచరిస్తోంది.

మృత్యుంజయుడు సరాసరి రహస్యాలోచన మందిరంలోకే జొరబడ్డాడు. అప్పటికి లక్ష్మీపతి ఇంకా కార్యాలయానికి రాలేదు. వెను వెంటనే రమ్మని ఉమాపతి కబురు పంపాడు. విష్ణుమూర్తి ఉన్నపళంగా ఉరుకులు పరుగుల్తో వొచ్చి నీలకంఠుణ్ణి దర్శించాడు.

"వీడు... ఈ బ్రహ్మగాడు ఇంకా రాలేదు!" అన్నాడు ఈశ్వరుడు, ఉద్రిక్తపూరితమైన కంఠస్వరంతో.

విష్ణుమూర్తి నవ్వి, "స్వామీ! మనం పన్నెండింటికి యీ సమావేశాన్ని ఏర్పరిచాం. ఇంకా గంట వ్యవధి ఉన్నది కదా! ఐనా మీరింత త్వరగా వొస్తారని నేనూ అనుకోలేదు సుమా!" అన్నాడు.

ఈశ్వరుడు కాస్త శాంతించాడు. ఇప్పుడిప్పుడే అలసట తీర్చుకుంటున్నాడు.

"ఔ నౌను...వెధవ ముసలి ఎద్దు ఎప్పటికి జేరుస్తుందోనని భయపడి, సూర్యోదయాన్నే బయలుదేరాను. అనుకున్నదానికంటే ముందుగా జేర్చింది...అది అలా ఉంచు. ఈ బ్రహ్మదేవుణ్ణి ఏ విధంగా మనం సుముఖం చేసుకోవాలో ఇప్పుడే ఆలోచించి ఉండటం మంచిది కదా!" అన్నాడు ప్రేతనాధుడు.

"ఆ మధ్య నేనొక తాఖీదు పంపాను. సృష్టి విపరీతంగా పెరిగిపోవటం వల్ల స్థితిని అందుకు తగినట్లుగా నిలపలేకపోవటం జరుగుతున్నదని హెచ్చరించాను ....దానికి ఏం జవాబు వొచ్చిందో బహుశా మీరు ఊహించ లేరనుకుంటాను!"

"ఊహలెందుకయ్యా? ఏమన్నాడూ?"

"తండ్రిననే గౌరవంకూడా చూపకుండా - తన విధిని తాను నిర్వర్తిస్తున్నాననీ, 'నీ విధిని నిర్వర్తించలేకపోవటం నీ అసమర్థతే అవుతుం'దనీ నాకు జవాబు పంపాడు!" అన్నాడు కేశవుడు, కొంచెం సిగ్గుపడుతూ.

శంకరుడు చిరునవ్వు నవ్వి అన్నాడు: "నాకూ అలాటి మర్యాదే జరిగింది. కొన్నాళ్ళపాటు సెలవు తీసుకున్నట్లయితే, భూలోకంలోని విషమ పరిస్థితులు కొంతవరకూ చక్కబడుతువని సలహా పంపాను. దానికి సృష్టి కర్త జవాబిది: కేవలం చంపటమే పనిగా పెట్టుకున్నవాళ్ళుకూడా శ్రమ పడిపోవటం తనకు ఆశ్చర్యమన్నాడు. అంతగా సమర్థించలేకపోతే మూడో కన్ను ఉండనే ఉన్నది కదా, తనను అర్థించట మెందుకని కూడా హేళన చేశాడు...ఏం చేసేదీ? నోరు మూసుకొని ఊరుకున్నాను!"

త్రినేత్రుడీ సంగతి చెప్పాక, నారాయణునికి కొంత తృప్తి కలిగింది. ఐతే ప్రస్తుతం ఉభయులకూ విషమ సమస్యగా తయారైన యీ బ్రహ్మదేవుడితో ఏం చెప్పి, ఒప్పించి సరిజెయ్యాలనేది తేలకుండా ఉన్నది.

"నేను అనుకోవట మేమిటంటే - యీనాడు సృష్టికర్త చెప్పే జవాబు కూడా లోగడ మనకు పంపిందే ఐవుంటుంది!" అన్నాడు మాధవుడు.

"నేనూ అదే అనుకుంటున్నాను. మనం ఏమన్నా గట్టిగా అంటే, ఆయన సహించడు. మొదటినుంచీ స్వాతంత్రేచ్ఛ గలవాడు. ఒకళ్ళ జోలి పట్టించుకోకుండా, తన పని చేసుకుపోతాడు. మన మాటల్ని సహించక, రాజీనామా ఇస్తానంటే మొదటికే మోసం వొస్తుంది. ఆయన స్థానాన్ని ఆక్రమించగల సామర్థ్యం మరెవరి కున్నది?

అదీ గాక కొన్ని యుగాలపాటు సృష్టిని సాగిస్తూ, ఆయన అందులో ఆరితేరిన వాడయ్యాడు. ఇప్పుడు కొత్తవాళ్ళను ఎన్నుకుంటే అంతా తలక్కిందు లవుతుంది...కనుక ఏదన్నా ఉపాయంతోనే యీ అపాయాన్ని దాటాలి!' అన్నాడు గంగాధరుడు.

"ఈ సమావేశానికి ముందే నేనెంతో తీవ్రంగా ఆలోచించాను ... కాని నాకు ఉపాయ మేమీ తోచలేదు!" అన్నాడు అచ్యుతుడు.

వాళ్ళిద్దరూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు. తన ముఖంలోని నిరాశ ఎదుటి వ్యక్తి ముఖంలో అద్దంలో చూసుకున్నంత స్పష్టంగా కనిపించింది. వారు అలాగే చాలాసేపు మౌనం వహించారు.

"ఏమన్నా కానీ! ఉద్రేకపడితే మాత్రం ప్రయోజనం ఉండదు. ఎలాగైనా ఆయన్ని పొగిడి, అంతవాడు, ఇంతవాడని చెప్పి, సుముఖుణ్ణి చేసుకోవాలని గుర్తుంచుకోవాలి!" అన్నాడు గౌరీపతి. జనార్దనుడు తల వూపాడు.

❋ ❋ ❋

సరిగా పన్నెండుంబావుకు కాని బ్రహ్మదేవు డెక్కిన హంస వైకుంఠంలో వాలలేదు. ఈ పావుగంటా విష్ణుమూర్తీ, శంకరుడూ చాలా చిరాకుపడ్డారు. ముళ్ళమీద కూర్చున్నట్లు బాధపడ్డారు. తీరా పద్మాసనుడు వొచ్చాడని వినగానే, ముఖాల్లోకి కొత్తగా చిరునవ్వును కొనితెచ్చుకున్నారు.

సృష్టికర్త సమాలోచనా మందిరాన్ని ప్రవేశిస్తూనే, ఉభయులకూ నమస్కరించాడు.

"క్షమించాలి. హంస నడక అనే లోకోక్తి ఉండనే ఉన్నది కదా! మీ విలువైన కాలాన్ని పదిహేను నిమిషాలు పాడు చేశాను!" అన్నాడాయన.

ఇంతవరకూ బాగానే ఉన్నదనుకున్నారు వాళ్ళిద్దరూ.

ముందు ఎవరు ఎలా మాట్లాడాలా అని ఆలోచిస్తున్నారు. వారిద్దరి ముఖాల్లోని ఆందోళనను చూసి బ్రహ్మదేవుడే ముందుగా మాట్లాడాడు: "అసలు సంగతేమిటి? ఏమి ఆజ్ఞ?"

ఇంత వినయంగా మాట్లాడినా సృష్టికర్త మనస్తత్వాన్ని నమ్మేందుకు లేదని ఈశ్వరునికి తెలుసు. అందుకనే ఒకరి ఎక్కువా, మరొకరి తక్కువా కనిపించకుండా చాలా సౌమ్యంగా మాట్లాడాలని ఆయన తనను తాను హెచ్చరించుకున్నాడు.

"పద్మాసనా! భూలోకం తల్లడిల్లిపోతూన్నది. జనాభా ఎంత విపరీతంగా పెరిగిపోయిందో నీకు తెలియకపోలేదు" అన్నాడు శివుడు.

పన్నగభూషణుడు చెప్పదలచినదేమిటో పద్మాసనుడికి అర్థమై పోయింది. ఆయన నాలుగు ముఖాల్లోని కనుబొమలూ ముడివడినవి.

"–ఐతే?" అన్నాడు బ్రహ్మ.

"మీరు తుంచేసినట్లు మాట్లాడకండి! కొంచెం తీవ్రంగా, సానుభూతితో ఆలోచిస్తే అర్థమౌతుంది. త్రిమూర్తులం విధులను పంచుకున్నప్పటికీ, పరిపాలనలో ఒక శాఖ మరొక శాఖపై ఆధారపడి ఉంటుందని నేను వేరుగా చెప్పనక్కర్లేదు. సృష్టి హద్దులు లేకుండా మీరిపోతూంటే, అటు స్థితి, లయాలు సమన్వయం కావటం ఎంత కష్టమో చూడండి!" అన్నాడు సాంబమూర్తి.

"ఆదిలో భూలోకమంతా బోసిపోయినట్లున్నదనీ, సృష్టి చాలా మందంగా సాగుతున్నదనీ మీరు తాఖీదులు పంపారు. నేను రాత్రనక, పగలనక సృష్టి విస్తరణలో వొళ్ళొంచి పని చేశాను. ఎన్ని రకాల జీవుల్ని తయారుచేశానో మీకు తెలుసు. క్షుద్రజీవులనుంచీ, జలచర, భూచరాలనే గాక, సృష్టిలోకల్లా వొంక పెట్టేందుకు వీలులేని మానవుల్ని కూడా తయారు చేశాను. అంతకన్న పరిపూర్ణత మరేముంటుంది! ఆనాడు మీరందరూ నన్ను అభినందించారు. భూభాగాలు ఇంకా నిండిఉండాలని హెచ్చరికలు చేశారు. తమ ఆజ్ఞానుసారం, ఈనాడు భూమిమీద మానవులు కిటకిటలాడేట్లు చేశాను; అది నేరమా?" అన్నాడు సృష్టికర్త.

"నేరమని కాదు. మీరు మీ విధిని నిర్వర్తించటంలో ఘనులనే మేము ఒప్పుకుంటాము. కాని, అందువల్ల మాకు కలిగే ఇబ్బందిని కూడా మీరు కొంచెం గమనించండి –" అన్నాడు ఉమాపతి.

"ఎవరి ఇబ్బందులు వారికి ఉంటవి. ఎవరి విధులను వారు నిర్వర్తించుకోవాలి. అంతేకాని మనలో మనం కుట్రపన్ని కర్తవ్యాలను వెనక్కు నెటట్టం న్యాయమా?" అన్నాడు బ్రహ్మదేవుడు.

ఈశ్వరుడు కాస్త సిగ్గుపడ్డాడు.

"అదికాదు స్వామీ! కొన్నాళ్ళపాటన్నా సృష్టి మందగించనట్లయితే–"

మాట మధ్యలోనే అందుకుని బ్రహ్మ అన్నాడు: "–ఏమౌతుందో నాకు అనవసరం. ఏమన్నా కానీండి. సృష్టి మాత్రం ఆగేందుకు వీల్లేదు. అక్కడి కర్మాగారంలో పనిచేసే వాళ్ళందరూ ఏం కావాలి? కొత్తగా యీ నిరుద్యోగ సమస్య నా మెడకు చుట్టుకుంటుంది. అదీగాక ఇప్పుడు సృష్టంతా యంత్రాల సహాయంతో సాగుతూన్నది. ఆ యా యంత్రాలు తుప్పుపట్టకుండా చూడాల్సిన బాధ్యత నాది. కనుక నా వల్ల ఉద్భవమయ్యే సమస్యల్ని మీకు మీరుగా పరిష్కరించుకోవటం ఒక్కటే మార్గం."

"ఆ మార్గమేదో తెలిసే వరకూ, ఆలోచించే వరకన్నా వ్యవధి నిమ్మని కైలాసాధిపతి కోరిక!" అన్నాడు జనార్దనుడు.

"సృష్టించటం కష్టమో, సృష్టించినదాన్ని నాశనం చేయడం కష్టమో అందరికీ తెలుసు కదా! ఇలాటి సమస్యకు నేను లోగడే సులిసూత్రం చెప్పాను కదా! ఈశ్వరుడు

ఆ మూడో కన్ను తెరిస్తే సరిపోతుందే!" అన్నాడు బ్రహ్మ.

"అది అంత తేలికా! విశ్వమంతా కాలి బూడిదైతే, మనం ఏలికల మెలా అవుతాము? శ్మశానాన్ని పాలించవలసిందే కదా!" అన్నాడు పార్వతీపతి.

"మీ సమస్యల పరిష్కారాలు మీరే చూసుకోండి. నేను సృష్టిని పెంచినందువల్ల మీ కార్యభారాలు అధికమైనవనే వాదనకు నేను తల వొగ్గను-" అన్నాడు సృష్టికర్త ఖచ్చితంగా.

"మీరు మా అసమర్థతల్ని బయట పెట్టేందుకే యీ ఎత్తు ఎత్తారని అనుకోవలసి వొస్తుంది!" అని హెచ్చరించాడు ఈశ్వరుడు.

బ్రహ్మ నాలుగు ముఖాలూ పకపకా నవ్వినవి.

"అలా ఎందు కనుకోవాలి? లయకారులైనవారు, నా సమర్థతను అగ్ని పరీక్షకు గురిచేశారని నేనెందుకు అనుకోరాదు? సర్వనాశనం చేసేందుకు బద్ధకంకణుడైన స్వామికి ఇంధనాలను సరఫరాచేయటం మాటలా?" అన్నాడు బ్రహ్మ.

"అందువల్ల తమ ఆధిక్యత బైట పడుతూనే ఉన్నది కదా" అన్నాడు శంకరుడు.

"ఏం సమర్థత? మీ ఉభయులకూ భూలోకంలో అనేక దేవాలయాలున్నవి. అనేకమంది భక్తులున్నారు. పూజా పునస్కారాలు మీకే కాని, నాకేమున్నవి? నన్ను తలిచే వాళ్లెవ్వరు? చిత్రం - భస్మీపటలం చేసేవారి క్కూడా భక్తులు! బహుశా భూలోకవాసులు భయపడి, యీ భక్తిని ప్రకటిస్తున్నారేమో?....అదంతా అలా ఉంచి నేను సృష్టిని విస్తరింపజేసి, తమ గొప్పను చెప్పుకునేందుకు గాను తగినంత అవకాశాల్ని కలిగించాను. కాని మీరేమో ఆ సదవకాశాన్ని దుర్వినియోగ పరుచుకుంటూ, నన్ను అపార్థం చేసుకుంటున్నారు. దానికి నా బాధ్యతేమిటి?" అన్నాడు కమలాసనుడు.

బ్రహ్మదేవుడు కొరకరాని కొయ్యగా తయారైనాడని శంకరుడు గ్రహించాడు. 'నీ వేమీ మాట్లాడ వేమి?' అన్నట్లు విష్ణుమూర్తిని చూశాడు.

"మీ రిద్దరూ బాగానే ఉన్నారు. ఒకళ్ళు సృష్టిస్తారు; మరొకరు నాశనం చేస్తారు! మధ్య నేను ఛస్తున్నాను. ఆమరణాంతం యీ జీవుల్ని పోషించటం మాటలు కాదు. నా బాధ ఎవరితో చెప్పుకునేది?" అన్నాడు వాసుదేవుడు.

"ఇందులో ఒకరి బాధ్యత లెక్కువా, మరొకరివి తక్కువా అనుకోవటం దేనికి? మీరలా భావిస్తే నా పని మీరెవరైనా చేయండి. మీ పనిని నేను చేస్తాను-" అన్నాడు బ్రహ్మ.

విష్ణుమూర్తీ, శంకరుడూ ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

"నీ పని నావల్ల అయేదికాదు. యుగాల తరబడి నీకు సృష్టిలో చేయి తిరిగింది!" అన్నాడు జగన్నాథుడు.

"మరి నన్నేం చేయమంటారు? రాజీనామా ఇమ్మని వొత్తిడి చేయ దలుచు కుంటున్నారా? ... నాకు తీరిక్కూడా లేదు. కనుక ఈ సమావేశాన్ని త్వరగా తెమల్చండి!" అన్నాడు వాణీపతి.

"స్వామీ! మీరు రాజీనామా ఇవ్వకండి. మా ఉద్దేశం అది కాదు. మాకు బొత్తిగా తీరిక లేకుండటమే గాక, ప్రాణాలు తోడేసే సమస్యలు కూడా ఎదురౌతున్నవి. మీరు కాస్త దయతలిస్తే-" అని ఈశ్వరుడు, ఆ చివరి మాట నోరు జారినందుకు నాలిక కొరుక్కున్నాడు. తన ఆధిక్యతంతా నీరుకారిపోయినందుకు ఆయన నొచ్చుకున్నాడు.

"అలాటి మాట లనకండి స్వామీ! ఇందులో దయా ధర్మాల ప్రస్తావన దేనికి? తీరి కంటారా? మీ రిద్దరూ, ఇద్దరేసి భార్యల్ని ఏలుకునే టంత తీరికను ఈనాటికీ అనుభవిస్తూనే ఉన్నారు కదా! ఎటొచ్చీ నేనే ఎముకలు విరగ్గొట్టుకుంటున్నాను!" అన్నాడు బ్రహ్మ.

నారాయణునికి కోపం వొచ్చింది; కాని ఎలాగో నిలవదొక్కుకున్నాడు.

"ఇద్దరు కాకుంటే నలుగురు భార్యల్ని ఏలుకోవచ్చు; కాదన్న దెవరూ? ఇక తీరికలేని పని అంటావా? అది ఎవరి తప్పూ? నీవుకూడా కాస్త తీరిగ్గా, కొన్నాళ్ళపాటు విశ్రాంతి తీసుకోమనే కదా, మా సలహా కూడాను" అన్నా డాయన.

"ఒళ్ళొంచి పనిచేయటమే నాకు ఆనందం. అందుకు నాకు లేని విచారం మీకెందుకు?" అన్నాడు చతుర్ముఖుడు.

ఇక ఏం చెప్పి లాభం లేదని తేలిపోయింది.

"ఇంతేనా, ఇంకేమన్నా ఉన్నదా?" అన్నాడు బ్రహ్మ గర్వంగా, ఠీవిగా చూస్తూ.

ఎవరికీ నోట మాట పెగలటం లేదు.

బ్రహ్మదేవుడు వెళ్ళిపొయ్యేందుకు లేచి నిలబడ్డాడు.

"ఒక్కమాట-" అన్నాడు పశుపతి. "మీరు సృష్టిని పరిమాణంలో పెంచుతున్నారే కాని శ్రేష్ఠతలో కాదు కదా! కనుక-"

మాట మధ్యలోనే బ్రహ్మ అడ్డుపడ్డాడు; అతని నాలుగు ముఖాలూ నవ్వినవి.

"శ్రేష్ఠత కాదా? ప్రతి యుగంలోనూ అసాధారణ వ్యక్తుల్ని సృష్టించానే! మోహిని నా సృష్టికాదా? రావణ్ణెవరు సృష్టించారు? సుయోధనుడు, కంసుడు, కర్ణుడు..."

"సృష్టించారు స్వామీ! వాళ్ళను వొదిలించుకునేప్పటికి మా పుర మారింది!" అన్నాడు విష్ణువు.

"ఎందువల్ల? రావణుడు అనేకమందిని చంపి, ఈశ్వరుని పని తేలిక చేస్తే, రావణుణ్ణి ఒక్కణ్ణే చంపిన కీర్తి మీకు దక్కింది కదా! అసాధారణత ఏ కాలంలో నేను నిరూపించలేదు? జగదేక సుందరులు హెలెన్, క్లియోపాత్రాలను సృష్టించలేదా? నిన్న

గాక మొన్న హిట్లర్‌ను భూమిమీదికి పంపలేదా?... మధ్య మధ్య అత్యుత్తమ మానవుల్ని, దేవతలకు సాటైనవారిని భూలోకానికి దిగుమతి చేయలేదా? మత ప్రవక్తలు మొదలూ మానవత్వాన్ని నిర్వచించేందుకు ఆదర్శ పురుషులైన వారిని మీరు ఎరగరా?... చివరకు అప్సరసలలాటి స్త్రీలను సృష్టిస్తే దేవతలైన వారికే కళ్ళు తిరిగిపోయి, భూమి మీదికి వెళ్ళి, వాళ్ళను అనుభవించేందుకు విశ్వప్రయత్నాలు చేయలేదా? అహల్యకోసం దేవేంద్రుడు, గంగకోసం ఈశ్వరుడు, తులసి కోసం విష్ణుమూర్తి తహతహ లాడలేదా? దమయంతీ స్వయంవరానికి, దేవలోకంలోని వారందరూ తరలిపోలేదా? ఈనాడు నా పనివాడితనానికి ఇంతకన్నా తార్కాణం దేనికి?... చివరకు మన్మధుణ్ని సృష్టిస్తే, శంకరుడంతటివాడు గిరికీలు తిరిగి, వాణ్ని భస్మంచేసి కాని మనశ్శాంతిని పొందలేకపోయిన విషయం అప్పుడే మరిచిపొయ్యారా? అందాలుచిందే చందమామను చూసి, ముచ్చటపడి, నెత్తి కెక్కించుకోవటాన్ని జ్ఞాపకం చేసుకోండి" అన్నాడు బ్రహ్మ, ఉద్రిక్తపూరిత కంఠస్వరంతో.

ఈశ్వరుడూ, విష్ణువూ జవాబు చెప్పలేక తలలు వేళ్ళాడవేశారు.

"ఐనా, నేను కేవలం సృష్టి పరిమితినే దృష్టిలో పెట్టుకోలేదు. యంత్రాల సహాయంతో శ్రేష్ఠత సాధ్యం కాకపోవొచ్చు. అందుకని గొప్ప గొప్ప వ్యక్తుల్ని నేనే స్వయంగా తయారు చేస్తున్నాను... చేస్తాను! మరొకసారి నా నిపుణతను త్వరలోనే చూపుతాను" అన్నాడు బ్రహ్మ దేవుడు, శపథం చేసే ధోరణిలో.

తన చివరి అస్త్రంకూడా పని చేయనందుకు శంకరునికి మతిపోయినట్లయింది. కాస్సేపు భరించలేని నిశ్శబ్దత ఆలోచనా మందిరంలో తాండవించింది.

"సరే నేను వొస్తాను!" అని బ్రహ్మ లేచి నిలబడి నమస్కరించి, బైటికి వెళ్ళిపొయ్యాడు.

మరి కాస్సేపు నిశ్శబ్దత వేళ్ళాడింది.

"లాభంలేదని నాకు ముందే తెలుసు" అన్నాడు శంకరుడు.

"ఇది మనిద్దరి చావుకూ వొచ్చింది!" అన్నాడు విష్ణుమూర్తి.

"నాలుగు తల లున్నందుకు ఆయన తెలివితేటల ముందు, మనం దమ్మిడీకి మారకుండా తయారయ్యాం!" అన్నాడు మహాదేవుడు.

"ఏం చేస్తాం - ఖర్మ;"

"ఖర్మ!... అంతే!... అంతే అనుకోవాలి మరి... నేను వొస్తాను. త్రిశూలానికి కాస్త పదును పెట్టిస్తాను.." అని త్రిశూలపాణి లేచి నిలబడ్డాడు.

"మధ్య నా సమస్యే తేలకుండా ఉన్నది-" అని గొణుక్కుంటూ శంకరుణ్ణి సాగనంపాడు దామోదరుడు.

## 2

ఆందోళనతో తన భర్త తిరిగిరావటాన్ని వాణి గ్రహించింది. బ్రహ్మ తు-చ తప్పకుండా వైకుంఠంలో జరిగిందంతా ఆమెకు చెప్పి అన్నాడు: "నేనట - సృష్టి విస్తరణనే కాని, పరిపూర్ణతను సృజించలేకపోతున్నానట! ఎంతమంది యుగపురుషుల్ని సృష్టించాను! ఎంతమంది సౌందర్యవతుల్ని సృజించాను! చరిత్రను అప్పుడే మరచిపొయ్యారు-వీళ్ళు! చూశావా!"

"నాకో ధర్మసందేహం స్వామీ!" అన్నది సరస్వతి. "మీరు నా కన్న అందగత్తెల్ని సృష్టించిన మాట వాస్తవం! ఆ పని ఎందుకు చేశారూ? ముల్లోకాల్లోకీ నేనే అందమైనదాన్ననే గర్వం ఒకప్పుడు నాకుండేది. నాకు గర్వభంగం చేయాలని మీరు ఉద్దేశించారా?"

ఎవరి గోల వారిదిగా తోచింది కమలాసనుడికి. ప్రస్తుత సమస్యేమిటి - తన భార్య మాట్లాడే విషయ మేమిటి? ఐనా జవాబు చెప్పి ఆమెను తృప్తిపరచవలసిన బాధ్యత తనకున్నది.

"ఎబ్బే! అదేం కాదు-" అన్నా డాయన. "ముల్లోకాల్లోనూ నిన్నే అందమైనదాన్నిగా సృష్టించాను కనుకనే వరస కాకపోయినా స్వార్థంతోనే అను, లేక నా సృజనాత్మక శక్తికి గీటు రాయిగానే అను.. నిన్ను భార్యగా స్వీకరించాను. ఐతే ఉత్తరోత్రా నీకన్న అందమైన స్త్రీలను సృష్టించాను; ఎందుకంటే కాలచక్రం ముందుకు సాగిన కొద్దీ నాక్కూడా చేయి తిరిగింది! నేను ముందడుగులే వేస్తున్నాను. ఏ కళోపాసకుడైనా అభ్యుదయాన్నే ఆశిస్తాడు కదా! అది నా నిపుణతకు పరీక్ష! ఐతే ఆ అందగత్తెల్లో ఎవ్వరూ నన్ను ఆకర్షించలేదని నీకు తెలుసు కదా! ఐనప్పుడు నా దృష్టికి మాత్రం నీ కన్న సౌందర్యవతి లేదని రుజూ ఐనట్లు కాదా!"

ఈ జవాబు వాణికి తృప్తికరంగానే తోచింది.

ప్రస్తుత విషయానికి వొస్తూ, చాలా రోజులుగా ఆమె కూడా భర్తకు మంచి సలహా చేయాలని, ఆ అవకాశంకోసం ఎదురుచూస్తూనే ఉన్నది. ఇదొక సదవకాశంగా ఆమె భావించింది.

అన్న దామె : "శంకరుడూ, విష్ణుమూర్తీ చెప్పిన మాటల్లోని సత్యాన్ని మీరింకా గ్రహించలేదు. వాళ్ళు ఎంత హాయిగా, ఆనందంగా, తీరిగ్గా ఉంటున్నారో మీరు ఆలోచించండి. శ్రమంతా మీదీ, కీర్తంతా వారి దీను. మీక్కూడా విశ్రాంతి అవసరం. మొత్తం పరిపాలనా చక్రాన్ని తీసుకున్నట్లయితే, మీరు పని వొత్తిడిని తగ్గించటం అత్యవసరమే కాగలదు. అందువల్ల ఇటు మీకూ మేలు కలుగుతుంది; అటు వారికీ

శ్రమ తగ్గుతుంది. అన్నిటికన్నా భూలోకవాసులు కాస్త శాంతియుత జీవితాన్ని గడిపేందుకు అవకాశం ఏర్పడుతుంది!"

బ్రహ్మ నలుముఖాల్లోనూ చిరుకోపం ఉదయించింది.

"నీవూ వాళ్ళతోనే కలిశావా! ఉద్యోగ ధర్మాన్ని గూర్చి నా కెవరూ చెప్ప నవసరంలేదు. బాధ్యతల్ని విస్మరించటమనేది నా జీవితంలో ఎన్నడూ జరగలేదు; ఇకముందు జరగబోదు. ఒకరిచేత చెప్పించుకునే విధంగా నేను పని చేస్తున్నానా? ఒకరి కష్టసుఖాల సంగతి నాకెందుకు? నాలాగే ఇతరులు కూడా కష్టించాలనే నేను కోరుతున్నాను, అంతే!" అన్నాడాయన.

ఇక ఏం చెప్పీ లాభముండదని సరస్వతి అనుకున్నది. ఐనా చివరి ప్రయత్నంగా మరొక్కసారి విడమర్చి ఆయన్ను సుముఖుణ్ణి చేసుకోవాలనుకున్నది.

"మీరు పిచ్చి బ్రహ్మలు! సకల సుఖాలూ పొందేందుక్కూడా నిరాకరిస్తున్నారు. ప్రపంచం తలక్రిందులు చేయగల వ్యక్తులు మీ చేతి మీదుగా తయారయ్యారు. అత్యంత సౌందర్యమున్న వనితల్ని కూడా రూపొందించారు...కాని వీరందరివల్లా ప్రపంచం సుఖశాంతులను పొందిందా? ఒకో అసాధారణ వ్యక్తి లోకచరిత్రనే తారుమారు చేశాడు. ఒకో సుందరీమణికోసం అనేక వేలమంది కొట్టుకు చచ్చారు...మీ కెందు కొచ్చిన శ్రమ ఇదంతా? ఇతరుల్ని ఏడిపించటమే మీకు వినోదమైతే..."

"వాణీ!" అని అడ్డు తగిలా డాయన. "నీవు కూడా నన్ను అర్థం చేసుకోలేక పోతున్నందుకు విచారిస్తున్నాను. నా వినోదం కొరకే నేను సృష్టిలోని చాకచక్యాన్ని చూపుతున్నానని ఎందుకు పొరబడుతున్నావో నాకు అర్థం కాకుండా ఉన్నది. ఒక కళాపిపాసి అత్యుత్తమమైన సృష్టి నెందుకు చేస్తాడు? అది ఒకవేళ నిరుప యోగమైనప్పటికీ, లేదా కీడు చేకూర్చే దైనప్పటికీ, అతను లెక్క చేయడు. తన కళాహృదయాన్ని ప్రస్ఫుటింప చేయటమే అతని ఆశయం! ఇంత స్వల్ప విషయం నీ కెందుకు బోధపడలేదు?"

తానింకా ఈ చర్చను సాగిస్తే, భర్త మండిపడతాడని గ్రహించిందా చదువులతల్లి. మెదలకుండా ఊరుకున్నది.

"చూడు: మరొక్క పక్షం రోజుల్లో కళాత్మకమైన వ్యక్తిని తయారు చేస్తాను" అన్నాడు బ్రహ్మ - తాను ఇంతకుముందు వైకుంఠంలో చేసిన ప్రతిజ్ఞను గుర్తుకు తెచ్చుకుంటూ.

"అపురూప సౌందర్యవతేనా?" అన్నది వాణి, అసంతృప్తి ధ్వనించే కంఠస్వరంతో.

"కాదు...సౌందర్యవతిని సృజించినప్పుడల్లా నీకు ఈర్ష్య వొస్తూంటుంది కదా!"

"నాకు ఈర్ష్య ఏమిటి?" అన్నదామె.

"అది స్త్రీ సహజం... ఈసారి నేనొక సుందరుణ్ణి రూపొందిస్తాను. వాడు మన్మధుని కన్నా, చంద్రుని కన్నా అందగాడు. అతన్ని చూసిన స్త్రీ తన మనసు మళ్ళించుకోలేదు!" అన్నాడు బ్రహ్మదేవుడు.

"ఏమి టేమిటీ?" అన్నదామె ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి.

"ఏమిటో – నా పనితనాన్ని త్వరలోనే చూపుతాను!" అన్నాడు బ్రహ్మ.

"అదికాదు...మీరు నిజంగా అంత సుందర పురుషుణ్ణి సృజించిన ట్లయితే, ప్రపంచం మరోసారి తల్లకిందు లవుతుంది. ఎంతమంది స్త్రీలు ఆత్మహత్యలు చేసుకుంటారో, మరెంతమంది ప్రాణత్యాగాలు చేస్తారో ఆలోచించలేకుండా ఉన్నాను; లేక అలాటి సుందర రూపుణ్ణి భరించలేని ప్రపంచం, ఆ ఒక్కణ్నీ నరికి అవతల పారేసి చేతులు దులుపుకుంటుందేమో?" అన్నది వాణి.

బ్రహ్మదేవుడు నవ్వాడు.

"ఇలాటి అనుమానాలు నాకూ రాకపోలేదు. అందుకనే వాణ్ణి కాకులు దూరని కారడవిలో పారేస్తాను. అక్కడ ఏ ఐదారుగురు స్త్రీల సాంగత్యం మాత్రమే వాడికి లభ్య మౌతుంది. అందగాడే ఐనా చదువు సంధ్యలూ, సంస్కారం లేకుండానే బతకమని శాసిస్తాను; ఆయుస్సు కూడా నలభై ఏళ్ళే ఇస్తున్నాను. స్త్రీలు అతన్ని ప్రేమించి, ఆరాధించవలసిందే కాని, అతను మాత్రం ఎవర్నీ ప్రేమించలేడు. కఠిన హృదయంతోనే బతుకు తెల్లవారుస్తాడు....కనుక ప్రపంచశాంతి భంగపడదు!" అన్నాడు బ్రహ్మ.

"పాపం! ఎంత అన్యాయం! తన సౌందర్యాన్ని తాను తెలుసుకోలేని స్థితిలో అమాయకంగా బతకమంటారా?" అన్నది సరస్వతి.

"మొత్తం న్యాయమంతా ఒక వ్యక్తికే ఇచ్చి, పక్షపాతాన్నిచూపుతా ననుకొన్నావా వాణీ! చంద్రు డంతటి వాడిక్కూడా మచ్చ నివ్వక తప్పలేదు కదా!" అన్నా డాయన.

"ఏమో! మీ సృష్టిలో వైపరీత్యాలు లేకుండట మనేది ఇవాళ కొత్త విషయం కనుకనా?...మీరా సుందరుణ్ణి తయారు చేయకుంటే, ముంచుకొనిపొయ్యే దేమున్నది కనుక?...ఎవరి పిచ్చి వారి కానందం!'

"పిచ్చా? కళారాధన పిచ్చా? ఎంత అమాయకపు జీవివి!" అని పరిహసించాడు బ్రహ్మ.

ఆమె ఎదురు చెప్పలేదు. మెదలకుండా ఊరుకున్నది.

"సరే...నేను కర్మాగారంలోకి వెళ్తున్నాను. బహుశా పదిహేను రోజులవరకూ బైటికి రాను. నన్నెవరూ చూడలేరు. కళారాధన ఒక తపస్సులాటిది కనుక నా ఏకాంతానికి భంగం వాటిల్లకుండా చూడు!" అన్నాడు బ్రహ్మ.

"స్వామీ! పక్షంపాటు తన దర్శనమే లేదంటే నా కెంతో దిగులుగా ఉన్నది!" అన్నది సరస్వతి.

"వియోగాన్ని భరించటం కూడా నేర్చుకో రాణీ!" అన్నాడాయన చిరునవ్వుతో.

"మీ కళాసృష్టిని చూడాలని తహతహ లాడుతున్నాను. నన్ను కూడా కర్మాగారంలోకి రానివ్వండి" అన్నదామె ప్రాధేయపడుతూ.

"ఉహుఁ. నా ఏకాగ్రత చెడుతుంది" అన్నా డాయన.

ఆమె ఏమైనా మాట్లాడుతే, జవాబు లివ్వవలసి వొస్తుందనే భయంతో బ్రహ్మదేవుడు చకచకా కర్మాగారంలోకి అంతర్ధానమైనాడు. వాణి తన ఓటమికి విచారపడుతూ నిలుచుండిపోయింది.

## 3

సరస్వతి చాలా దిగులుగా ఉన్నది. ఇలా వారాల తరబడి వియోగాన్ని భరించటం ఆమె ఇదివరకు ఎరగదు. ఐతే తన భర్త ఇతర దేవాధిపతుల వలె విలాస పురుషుడు కాదనీ ఆమెకు తెలుసు. దాంపత్యం జీవితావసరమనే ధోరణి ఆయన కనబరుస్తాడు. కైలాసంలోనూ, వైకుంఠంలోనూ, స్వర్గంలోనూ అప్సరసనాట్యాలూ, గాన వినోదాలూ ఎల్లకాలమూ జరుగుతాయి. తాను మహా పతివ్రత గనుక, భర్త అడుగుజాడల్లోనే ఇన్నాళ్లూ నడవ గలిగింది కాని, తన మనోగత మేమిటో ఆలోచించే తీరికన్నా ఆయనకు లేదు. తాను సంగీతంలో నిధి! రాళ్ళను కరిగించే గానమాధురి. తన భర్తను పరవశు ణ్ణి చేయలేదు! తన విద్య నిరర్థకమని అనుకుంటున్నదంటే - తన తప్పా?

తన ఈ కాపరంలో ఒక్క ముచ్చటన్నా తీరలేదు కదా! ఇన్నాళ్లూ ఈ విషయాన్ని గూర్చి తాను తీవ్రంగా ఆలోచించలేదు. ఇప్పు డాయన పట్టుదలతో కర్మాగారాన్ని బిడాయించుకొన్నాక, జీవితంలో తీరని లోటు కనిపిస్తూ, పీడిస్తూ, చిరాగ్గా - పరాగ్గా ఉండేట్లు చేసింది.

తన భర్తను మార్చటం బ్రహ్మతరం కాదు! ఎంతకూ తానే మారుతూ, ఎక్కడి కక్కడ సరిపెట్టుకోవటమే జరుగుతూన్నది. ఇదమిద్ధంగా తేల్చుకునే పాటి సామర్థ్యం తనకు లేదు. ఆయన నాలుగు తలల్లోనూ, కనీసం ఒక్క దాన్నన్నా తనకొరకు కేటాయిస్తే ఎంత బాగుండును! ఇతర దేవాధిపతుల్లాగు స్త్రీ వ్యసనం లే దాయనకు! అందుకు తాను ఎంతో సంబరపడుతుంది. సవతులైతే తనకు లేనిమాట వాస్తవమే కాని అంతమాత్రాన తాను సుఖపడుతున్నదా? ఈనాడు రుద్రుడూ, నారాయణుడూ తన భర్త పాదాల మీద వాలే పరిస్థితులు ఏర్పడినందుకు తాను గర్వపడగలదేమో కాని, సౌఖ్యానికి ఆ తలపు సహాయపడగలదా? ఎంత కళారాధకుడైనా, తన భర్త రసికుడు ఎందుకు కాలేకపొయ్యాడో కదా!

ఆమెకు బొత్తిగా తోచటంలేదు; మరీ పిచ్చెక్కినట్లున్నది! కాలు కాలిన పిల్లివలె కర్మాగారం పరిసరాల్లో తారట్లాడింది. గొంతెత్తి మధురగానం చేసింది. తన చుట్టూవున్న ప్రపంచమంతా తన్మయమైనది. కాని తన భర్తను మాత్రం ఆ గాన మాధురి కదల్చలేక పోయింది. ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళిట్లా? ఆమెకు జీవితమే వెగ టనిపిస్తూన్నది. ఇకముందు, ఈ అసాధారణ వ్యక్తుల కొరకై రోజుల తరబడి దర్శన మివ్వనట్లయితే..తానేదో అఘాయిత్యం చేస్తానని బెదిరించాలి! అప్పటికైనా లొంగి వస్తా డనేదీ సందేహమే!

ఈ విధంగా పదిహేను రోజులు గడిచాక కర్మాగారపు తలుపులు తెరుచుకున్నవి. చతుర్ముఖాలూ చెమటలు కక్కుతూండగా బ్రహ్మ బైటికి వొచ్చాడు. ఎంతో అలసట ఆయన ముఖాల్లో స్పష్టంగా కనిపిస్తూన్నది. ఐతే ఏదో ఘనకార్యాన్ని సాధించిన తృప్తికూడా కానవస్తూన్నది. విజయ సూచికగా నవ్వుతూ ఆయన, తననే గమనిస్తున్న వాణి దరిజేరాడు. ఆమె మూతి ముడుచుకుని అలక ప్రకటించింది.

"రాణీ! ఎందుకు నా మీద కోపం? సృష్టికంతకూ అధిపతిననీ, నీకు భర్తననీ గర్వపడ వెందుకని? ఈసారి నేను సృజించిన అత్యంత సుందర రూపుణ్ని చూస్తే శశాంకుడు కూడా చిన్నబోతాడు. కళామ తల్లివి, కళారాధకుల్ని గౌరవించ వెందుకని?" అన్నా డాయన.

ఆ అపురూప సుందరుడు ఎలా ఉండి ఉంటాడోనని ఆమె ఆలోచిస్తూన్నది.

"నిజంగా, నా సృష్టిని చూసి ఈనాడు నేనే గర్వపడ్డాను!" అన్నాడాయన.

ఆమె కుతూహలం రెట్టించింది.

"స్వామీ! నాకు చూపరా?" అన్నది; కోపమంతా చల్లారి చిన్న కోర్కెకు దిగజారింది.

ఆయన తల అడ్డంగా తిప్పాడు.

"ఉహుం, నీ కోర్కెను నేను మన్నించలేను. అసాధారణ వ్యక్తులు ఎంత ప్రమాదకరమైనవారో నాకు తెలియకపోలేదు. అందుకని ఆ మానవుడికి రేపు తెల్లవారు జామునే ప్రాణ మిచ్చి, సూర్యోదయం కాకముందే భూమి మీదకు విసరివేస్తాను!" అన్నా డాయన.

"తమ కళానైపుణ్యాన్ని చూసి ఆనందించే భాగ్యమన్నా నాకు లేదా?" అని ప్రాధేయపడిం దామె.

"చెప్పాను కదా, వాణ్ని చూసిన ఆడదానికి తప్పక మనస్సు చలిస్తుందని? తెలిసి వుండీ, నిన్ను చూడనిస్తానా? అందువల్ల ఎంత ప్రమాదం వాటిల్లుతుందో నాకు తెలియదా? ...అదంతా పోనీ...నీవు ఎంత కృశించావు! దిగులు పడ్డావు కదూ?...రాణీ! నా విధులను నిర్వర్తించటంలో నీ ముద్దు ముచ్చట్లే మరిచిపోవలసి

వొస్తోంది. ఏం చెయ్యను? ఉద్యోగ ధర్మం ముందు మిగతావన్నీ అల్పాలుగానే నాకు తోస్తూంటవి!" అన్నాడు బ్రహ్మదేవుడు.

తనకు తెలిసిన విషయాలే ఆయనా చెప్పాడు. కాని సమస్యా స్వరూపాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్నా, పరిష్కార మార్గ మేమిటో తెలిసి, అదీ తన చేతుల్లోనే ఉన్నప్పటికీ, ఆయనింకా ధర్మపన్నాలే పలుకుతున్నాడు. తాను ఏం మొత్తుకొని ఏం లాభం? అందుకని ఆమె ముభావంగా ఊరుకున్నది.

"ఈ వియోగ వ్యధ నాకు మాత్రం లేదా?...పద రాణీ! వాహ్యాళికి వెళ్దాం!" అన్నాడు బ్రహ్మ.

తన జీవితానికి యింతవరకే దక్కుదలని ఆమె తృప్తిపడక తప్పలేదు.

## 4

ఆ రాత్రి సరస్వతికి నిద్ర పట్టలేదు. తాను ఎంతోమంది సుందరాకారుల్ని చూసింది! పూవిలుకానికన్నా, పున్నమి చంద్రునికన్నా సుందరుడు ఎలా ఉంటాడో తన ఊహకు అందటంలేదు. అలాటిది ఊహించటమేగాక, చిత్రీకరించి, సృష్టించి, ప్రాణప్రతిష్ఠ చేసినప్పుడు ఆ జీవకళతో వుండే సౌందర్యాన్ని చూసితీరాలని తనకు ఆరాటం కలగటంలో వింతేమిటి?... చూసినంతమాత్రాన వొచ్చిపడే నష్ట మేమిటి? స్త్రీ హృదయాన్ని హరించటంలో ఆ మానవుడు దిట్టే అవుగాక! ఐతే మానవుడైన ఆ సుందరుని మీద దేవతాస్త్రీ ఐన తనకు మనసు పోతుందేమోనని తన భర్త భయపడటంలో అర్థం లేదు! అదంతా ఆయన భ్రమేనని తాను నిరూపించగలదు! అప్పుడు కాని ఆయన తన ఇతర పొరబాట్లను కూడా ఒప్పుకొని ఒక దారికి రాడు. ఇదంతా ఎలా ఉన్నప్పటికీ తన భర్త తరువాత తానే రెండో ప్రేక్షకురాలుగా ఉండాలి!

ఐతే ఈ సంగతి తన భర్తకు తెలుస్తే ఆయన ఒప్పడు. ఎటూ తెల్లవారుజామున ఆ మానవుణ్ణి భూమి మీదికి సాగనంపుతాడు కనుక, ఆయనకు తెలియకుండా కర్మాగారం బైట కాపువేసి, ఆ సౌందర్యరాశిని చూసి కన్నుల పండువ చేసుకోవాలని ఆమె నిశ్చయించుకున్నది.

ఎప్పుడు కునుకుబట్టి నిద్రవొస్తుందోనని ఆమె భయపడింది. ఒక పక్క నిద్రపోతూన్నట్లు నటిస్తూనే మేలుకొని వున్నది. తన జన్మకు ఇదే శివరాత్రని అనేకసార్లు తనను తాను హెచ్చరించుకున్నది. ఒక కంట తన భర్తను కనిపెట్టే ఉన్నది.

ఆఖరు జాములో బ్రహ్మదేవుడు వొళ్ళు విరుచుకుని లేచాడు. అటూ ఇటూ కలయజూచి, చప్పుడు కాకుండా ఉండేందుకు మునివేళ్ళ మీద నడుచుకుంటూ బైటపడ్డాడు.

ఆయన వెళ్ళగానే వాణి కూడా లేచి కూర్చున్నది. కాస్సేపు ఆగి, కర్మాగారానికి బైట చీకటి మూలలో నక్కి నిలబడింది. ఆమె కళ్ళు ఆతృతతో కర్మాగారపు తలుపులవైపే ఎదురుతెన్నులు చూడసాగినవి.

కొంతసేపయాక తన ఊహలకందని రూపవంతు డొకడు కర్మాగారం నుంచి మెల్లిగా నడిచి రావటాన్ని వాణి చూసింది. ఎంత అందం! నడకలో ఎంత రాజసం! ఇంత సౌందర్యాన్ని గూర్చి ప్రపంచం ఎన్నడూ కని, విని ఎరుగదు. స్త్రీ జన్మ పావనం కావాలంటే, నిజంగానే ఈ సౌందర్యాన్ని ఆరాధన చేయాలి! యుగాలుగా తన మనస్సులో మూలమూలలా దాగొనివున్న కోర్కెలు క్షణంలో మహావృక్షాలవలె హృదయమంతటా వ్యాపించినవి. వికారంతో, తీయని వాంఛల ఆత్రుతతో ఆమె వొణికిపోయింది. ఇంత తీవ్రమైన ఉద్రేకం ఇదివరకెన్నడూ తనకు కలగలేదు.

తాను సృష్టికర్త భార్యననేమాట, దేవత్వమున్న స్త్రీననే జ్ఞానం, మానవమాత్రుడి ప్రణయపు టుచ్చుల్లోకి తెలియకుండానే పడిపోతున్నాననే సత్యాన్ని ఆమె గ్రహించలేదు. ఈ యుగపురుషుని ప్రణయంముందు ముల్లోకాలూ కూడా అతి స్వల్పాలనే భావన ఆమెలో లోతుగా పాతుకొని పోయింది. తనకు తెలియకుండానే ఆ అందగాని ముందు మోకరించిందామె... కాని అత నామెను గమనించకుండానే భూలోకం వైపు పయనమయ్యాడు.

ఈ సమయంలో బ్రహ్మ పరుగు పరుగున వొచ్చి సరస్వతి చేయి పట్టుకున్నాడు. ఆమె ఎంతో అసహ్యం ఉట్టిపడేట్లుగా ఆయన ముఖంలోకి చూసి, చేతిని వెనక్కు లాక్కుంది.

"ఏమిటీ అఘాయిత్యం?" అన్నా డాయన.

"నేను కూడా భూలోకానికి వెళ్తున్నాను!" అన్నదామె.

"ఆ వెధవను చూడొద్దని చెబితే విన్నావు కాదు!" అని కళ్ళెర్ర జేశాడు, బ్రహ్మ.

"చూడకుండా ఉండలేకపొయ్యాను. కళ్ళున్న వాళ్ళందరూ, సౌందర్యాన్ని చూడాలనీ, ఆరాధించాలనీ కోరటం సహజమే కదా! మీ సృష్టిని కొంతమందన్నా చూడాలనే ఉద్దేశ్యం మీకు మాత్రం లేదా? ఆ ప్రయోజనాన్ని మీరు ఆశించనట్లయితే, మీ రసలు అసాధారణ వ్యక్తుల్ని సృజించవలసిన అవసరం ఏమున్నది? ఆ సృష్టంతా మీ ఊహల్లోనే ఉండిపొయ్యేది కదా?" అన్నది వాణి.

"అది సరే...నీవు భూలోకానికి వెళ్ళేందుకు వీల్లేదు!" అన్నాడు బ్రహ్మ.

"మీ రెవరు నాకు చెప్పేందుకు! ఆ అందగాణ్ణి చూసిన క్షణంలో నేను అతనికి అంకితమైపొయ్యాను. ఈ కోర్కె తీరకుంటే, దాని వేడికి నేను భస్మమైపోతా ననిపిస్తూన్నది..." అన్నదామె.

"రాణీ! నీకేమన్నా మతిపోయిందా? నీవు మహా పతివ్రతవు. చదువుల తల్లివి. నీకు పరపురుషుని మీదికి మనసు పోవటమేమిటి? ఆ మాట పైకి అనేందుకు నీ కెంత సాహసం! అందునా నీ భర్తనైన నా దగ్గిర్నా?" అన్నాడు బ్రహ్మ నిప్పులు కురిపిస్తూ.

పకపకా నవ్విందామె.

"నేనేం చేసేది? ఆ సుందరుణ్ణి చూడగానే నా శక్తులన్నీ వశం తప్పినవి. నేను చెప్పినట్లుగా నా మనస్సు వినటం లేదు; నా మనస్సు చెప్పిన విధంగానే నేను నడుచుకోవలసిన దుర్భర పరిస్థితి ఏర్పడింది...ఏమో మొదట నేనూ అనుకున్నాను; ఆ అందగాణ్ణి చూసినంత మాత్రాన పొయ్యే దేమిటని! కాని స్త్రీ హృదయంలో చిచ్చుపెట్టే శక్తి వున్న వ్యక్తని నేను అనుకోలేదు...మీ అమోఘ సృష్టిలో కల్పించిన గుణగణాలు వృథా అవుతవా? 'నిన్ను చూసిన స్త్రీ నీ వెంటపడి, ఆత్మార్పణ చేస్తుందిగాక!' అని వాడి మొహాన రాశారు. నాకు అతనితోపాటు భూమి మీదికి వెళ్ళి ఆ ప్రణయారాధనలో కాలం గడపాలనే దుష్టవాంఛ లేదు; కేవలం సదుద్దేశంతోనే అతన్ని చూశాను....కాని, మీ రాతను తప్పించటం ఎవరి తరం? బ్రహ్మ వాక్కు వృథాపోవటం జరిగితే, ఇంకేమన్నా ఉన్నదా? మీ మాట మహిమ అమోఘం! నేనేం చేసేది?" అన్న దామె.

బ్రహ్మ నివ్వెరబొయ్యాడు.

"ఔ ననుకో..కాని నీలాటి విజ్ఞురా లేమిటి, కామవాంఛలకు బానిసై పోవట మేమిటి!" అన్నా డాయన.

"బ్రహ్మ వాక్కుకూ, బ్రహ్మాస్త్రానికీ తిరుగు వుండగలదా?"

"వాణీ! కాస్త ఆలోచించు: భూలోకానికి వెళ్ళి నీవేం సుఖపడతావు? వాడి ఆయుస్సే నలభై యేళ్ళు!" అన్నా డాయన.

"కనుక త్వరలోనే తిరిగి వస్తాను కదా! వియోగాన్ని భరించటం కూడా అలవరచుకోవాలి మరి!" అన్నదామె. లోగడ భర్త చెప్పిన మాటల్ని ఆయనకే అప్పగిస్తూ.

"స్త్రీ వాణ్ణి ప్రేమించటమే కాని, వాడు స్త్రీని ప్రేమించలేదు; కఠిన హృదయుడు!"

"పోనీండి.....అలాటి వాడే కావాలి! అచంచలమైన ఆరాధనతో గడుపుతాను. అతను నన్ను ప్రేమించగలగటం ప్రణయానికి శిఖరాగ్రం! ఆ పైన ప్రణయ మనేది ఉండదు కదా! కనుక ఆ శిఖరానికి పోయి కళ్ళు తిరిగి కింద పడకుండా నన్ను నేను కాపాడుకోగలుగుతాను కదా!" అన్న దామె.

"చదువు సంధ్యలూ, సంస్కారమూ లేనివాణ్ణి కొలుస్తావా?"

"చదువుల తల్లినైన నేను అతనికి విద్య నిస్తాను-" అన్న దామె, తనక్కూడా దివ్య శక్తులున్నవనే ధీమాతో!

"నీ తరం కాదు! బ్రహ్మ రాసిన రాతను సరిదిద్దేందుకు, మార్చేందుకు ఆ బ్రహ్మకే చేత కాదు! కేవలం మానవ మాత్రురాలుగా మాత్రమే అడవిలో అనాగరికంగా బతకాలి!" అన్నా డాయన.

"పోనీండి...అలాగే బతుకుతాను!" అన్నదామె.

ఇంకా ఏం చెప్పి ఆమెను సమాధానపరచాలా అని బ్రహ్మ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"ఇప్పటికే చాలా కాలయాపన ఐంది....నేను వెళ్తున్నాను. సెలవు!" అన్నది వాణి.

"ఆగు...నీ యీ దివ్యత్వాన్ని తుచ్ఛ వాంఛల కోసం వొదులుకుంటావా? రేపు దేవాధిపతులంతా నవ్వరా? ఇది మనకెంత అవమానమో ఆలోచించు!" అన్నాడు బ్రహ్మ.

"దానికి నా బాధ్య తేమిటి? భూమిమీది మానవులకోసం తహతహలాడి వారి తోడి అనుభవాలకు ఉవ్విళ్ళూరి, కోర్కెల్ని తీర్చుకున్న యీ దేవ నాయకులు నవ్వితే, అది తమను చూసి తామే నవ్వుకున్న ట్లవుతుంది కదా! ... ఇక అవమానం ఎవరికి? ఎందుకు?...మీరు సృజించిన ప్రతి అసాధారణతా ఏదో వొక భూకంపాన్ని, తారుమారును తెచ్చిపెడుతూనే ఉన్నది కదా! అత్యంత బలాఢ్యుణ్ణి మీరు తయారు చేస్తే, వాడు బలహీనులందర్నీ తొక్కేస్తాడు. గొప్ప తెలివితేటలున్నవాణ్ణి మీరు సృజిస్తే, లోక కంటకుడౌతుడున్నాడు కదా!...అదేవిధంగా ఇప్పు డీ సుందరుణ్ణి సృష్టిస్తే, నేను ఎరనయాను. ఇదివరకు ఇతరులకు కలిగే నష్టం యీ నాడు మీకూ, నాకూ కలిగింది. అంతే భేదం!" అన్నది సరస్వతి.

"వాణీ! వీడు...ఈ సుందరాంగుడు నీకేమన్నా వరసా? వాయా?" అన్నాడు చతుర్ముఖుడు.

ఆమె పకపకా నవ్వింది.

"నేను మీకేం వరస? ఈ వరసలు బ్రహ్మలోకంలో చెల్లవేమో కాని, భూలోకంలో, వేరొక అవతారంలో ఎందుకు మారవు?" అన్నదామె.

భార్య చెప్పిన మాటల్లోని నిగూఢ సత్యాన్ని ఇప్పుడిప్పుడే స్పష్టంగా తెలుసుకో గలుగుతున్నాడు బ్రహ్మ.

"సెలవు–" అని వాణి సాగిపోతున్నది.

ఇక తన చేతుల్లో ఏమీలేదు. బ్రహ్మవాక్కు అమోఘమని తాను గర్వించాలా? లేక తన కాపరానికి పట్టిన ఖర్మకు విచారించాలా? ఏదీ అర్థంగాక శిలాప్రతిమవలె నిలబడిపొయ్యాడు బ్రహ్మదేవుడు!

– *జనవరి, 1958*